ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5


శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శనివారం 6 ఏప్రిల్ 2024



నిప్పుల కొలిమి



శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో.. నిర్మానుష్యంగా ఆమదాలవలస ప్రధాన రహదారి

- భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు
- అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులతో అవస్థలు
- నిర్మానుష్యమైన ప్రధాన రహదారులు

(సరుబుజ్జిలి/ మెళియాపుట్టి/ నరసన్నపేట/ నందిగాం)

సిక్కోలు నిప్పులకొలిమిలా మారింది. శుక్రవారం ఉదయం నుంచీ భానుడు భగభగమన్నాడు. ఓవైపు ఎండ తీవ్రత, మరోవైపు వడగాలులు వీయడంతో జిల్లా ప్రజలు అల్లాడిపోయారు. శుక్ర, శనివారాల్లో భానుడు తీవ్ర ప్రతాపం చూపనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఏపీఎస్ డీఎంఏ) ముందే హెచ్చరిక జారీ చేసింది. శుక్రవారం 24 మండలాల్లో తీవ్ర వేడిమి ఉంటుందని.. వడగాల్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. అదే మాదిరి శుక్రవారం 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. సరుబుజ్జిలిలో చుట్టూ ఎత్తయిన కొండలు ఉండడంతో మరింత వేడి ఎక్కువగా కనిపించింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నాలుగు కూడలి జంక్షన్ సమీపంలో ఉదయం 10 గంటల నుంచీ జనసంచారం లేకుండా నిర్మానుష్యంగా కనిపించింది. ఆమదాలవలసలో కూడా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నరసన్నపేట, మెళియాపుట్టి, నందిగాం తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అత్యవసర పనులుంటేకానీ ఎవరూ బయటకు రాలేదు. కొంతమంది తలకు ఎండ తగలకుండా జాగ్రత్తలు పాటిస్తూ రాకపోకలు కొనసాగించారు.





రహదారులు నిర్మానుష్యం

సరుబుజ్జిలిలో..



మెళియాపుట్టిలో..



నందిగాంలో..



టెక్కలి మండలం గూడెం గ్రామ సచివాలయం

పంచాయతీలకు 'షాక్'!


- జిల్లాలో రూ.12కోట్ల మేర విద్యుత్ బకాయిలు
- బిల్లులు చెల్లించాలంటూ అధికారుల ఒత్తిడి
- ఆందోళన చెందుతున్న కార్యదర్శులు, సర్పంచ్‌లు

(టెక్కలి)

పంచాయతీలకు విద్యుత్ బకాయిలు గుదిబండగా మారాయి. జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను తక్షణమే చెల్లించాలంటూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో నిధులు లేకుండా తామెలా బకాయిలు చెల్లించగలమంటూ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఎన్నికవడమే తాము చేసిన పెద్ద తప్పు అని సర్పంచ్‌లు లెంపలేసుకుంటున్నారు. పంచాయతీల అభివృద్ధికి అన్నివిధాలా దూరమయ్యాయమని వాపోతున్నారు. ఎన్నికల వేళ ఇదేమి ఒత్తిడి అంటూ ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 917 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో 11 నెలల కాలానికి గానూ జిల్లాలో వీధిదీపాలు, రక్షితనీటి పథకాలకు సంబంధించి రూ.12 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయి. వాటిని తక్షణమే జమ చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ మొదలుకొని జిల్లాస్థాయిలో డీపీవో, సీఈవో, ట్రాన్స్‌కో ఎస్ఈ తదితర శాఖల ఉన్నతాధికారులు డిమాండ్ చేస్తున్నారు. వీడియోకాన్ఫరెన్స్, టెలీకాన్ఫరెన్స్‌ల ద్వారా ఆయా పంచాయతీల పరిధిలోని కార్యదర్శులపై ఒత్తిడి పెంచారు. గడచిన మూడేళ్లలో పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌లకు తెలియకుండానే నేరుగా రాష్ట్ర ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ ఖాతా కింద పాత బకాయిలంటూ జమ చేశారు. ఇటీవల 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి మలివిడత నిధులు పీఎఫ్ఎంఎస్ కింద గ్రామపంచాయతీలకు సంబంధించిన కొత్తఖాతాల్లో జమయ్యాయి. గతంలో కార్యదర్శులు, సర్పంచ్‌ల అనుమతులు లేకుండా నిధులు దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అలా చేయడానికి సాధ్యపడలేదు. పీఎఫ్ఎం ఎస్ కింద మంజూరైన మలివిడత 15వ ఆర్థిక సంఘం నిధులు తీయాలంటే కార్యదర్శితో పాటు సర్పంచ్ డిజిటల్ సిగ్నేచర్ ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో ఆ నిధులు ఎలాగైనా వీధి దీపాలు, రక్షితనీటి పథకాల బకాయిల కింద జమ చేసేందుకు ఆయా శాఖల అధికారులు ఒత్తిడి తెస్తుండడంతో పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు ఇదేం ఖర్మ అంటూ తలలు పట్టు కుంటున్నారు. పంచాయతీల ఖాతాల్లో నిధులు జమైన మరుక్షణమే బకాయిలంటూ రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లోకి జమచేయడం అన్యాయమని వాపోతున్నారు.

మంత్రి, స్పీకర్‌కు మృత్యుఘోష కనిపించదా?

- శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో నిత్యం ప్రమాదాలే..
- గోతులమయంతో నరకయాతన



రాగోలు సమీపంలో రహదారిపై గుంతలు

(ఆమదాలవలస)

శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతల మయమైంది. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుని.. కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా.. మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు మృత్యుఘోష వినిపించదా అంటూ పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ గుంతల రహదారిలో రక్తదాహం ఆగేదెప్పుడు అని నిలదీస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రహదారికి కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ గోతులతో అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిని బాగుచేయాలని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, పరిసర ప్రాంత ప్రజలు, వాహనదారులు ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నా మంత్రి, స్పీకర్ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.



లారీ చక్రాల కింద నలిగి మృతి చెందిన కానిస్టేబుల్ గన్నయ్య (ఫైల్)

ఎన్నో ప్రమాదాలు..

- ఇటీవల శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ముకుందరావు గుంతల రహదారిపై ద్విచ క్ర వాహనంతో వెళుతూ వంజంగి సమీపంలో లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.
- కొన్నాళ్ల కిందట సరుబుజ్జిలి మండలం షలంత్రి గ్రామానికి చెందిన దళిత నిరుద్యోగి మామిడి బాబూరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈయన ద్విచక్ర వాహనంపై వస్తూ నందగిరిపేట సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు.
- తాజాగా గురువారం రాత్రి ఆమదాలవలస రైల్వే ఔట్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బొడ్డేపల్లి గన్నయ్య ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ద్విచక్రవాహనంపై వస్తూ రాగోలు ఆర్టీసీ కాలనీ సమీపంలో గుంతలు తప్పించబోయి లారీచక్రాల కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన కుటుంబ సభ్యులతోపాటు స్థానికులకు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొంతమంది దివ్యాంగులుగా మారుతున్నారు.
- ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి అభివృద్ధిపై ఇటీవల మంత్రి ధర్మానను పలు గ్రామాల్లో ప్రశ్నించారు. కాగా రహదారులు వేస్తేనే అభివృద్ధా? అంటూ ధర్మాన వ్యంగ్యంగా మాట్లాడడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా ఈ మృత్యుఘోషకు ధర్మాన సమాధానం చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. రహదారిని అభివృద్ధి చేస్తామని స్పీకర్ తమ్మినేని సీతారామ్ హామీ ఇచ్చారు. కానీ, ఇంతవరకూ పనుల ఊసే లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



లారీ ఢీకొని మృతి చెందిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ ముకుందరావు (ఫైల్)

కోర్టు ఆదేశాలు బేఖాతరు...

శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారి గుంతల సమస్య పరిష్కరించాలని సీనియర్ న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు ఆమదాలవలస కోర్టులో ఇటీవల ప్రజావాజ్యం దాఖలు చేశారు. దీనిపై స్పందించిన జూనియర్ సివిల్ న్యాయాధికారి రోడ్డు భవనాల శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు కోర్టుకు హాజరైన సూపరింటెండెంట్ ఇంజనీర్ 15 రోజుల్లో గుంతలను పూడ్చి.. రహదారి చదును చేస్తామని తెలిపారు. కానీ ఇంతవరకూ పనులు చేపట్టలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

టీ షర్ట్ కోసం ఘర్షణ

- సోదరుల మధ్య తగాదాలో అన్న మృతి



రమేష్ (ఫైల్)

రమేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 5: టీ షర్ట్ కోసం అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో క్షణికావేశంతో తమ్ముడు నెట్టేయడంతో అన్న కిందపడగా తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అన్న ప్రాణాలు కోల్పోయాడు. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాకరాపల్లికి చెందిన తాళాభక్తుల రమేష్ (31), సురేష్(25) అన్నదమ్ములు. వీరిద్దరూ తల్లిదండ్రులు ఆదినారాయణ, రత్నాలుతో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. రమేష్‌కు వివాహం కాగా.. భార్య స్వాతితో పాటు ఒక కుమారుడు ఉన్నాడు. అన్నదమ్ములిద్దరూ వడ్రంగి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కాగా.. గురువారంరాత్రి రమేష్ టీ షర్ట్‌ను సురేష్ ధరించాడు. తన టీ షర్ట్ ఎందుకు వేశావంటూ రమేష్ తమ్ముడిని నిలదీశాడు. టీ షర్ట్ వేసినందుకే ఎందుకింత రాద్ధాంతం చేస్తున్నావంటూ సురేష్ ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. క్షణికావేశంతో సురేష్ తన అన్నను నెట్టేశాడు. దీంతో రమేష్ ఓ రాయిపై పడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై రమేష్‌ను శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం రమేష్ మృతి చెందాడు. దీంతో భార్య, కుమారుడితోపాటు తల్లిదండ్రులు విలపించారు. చిన్నపాటి ఘర్షణలో ఊహించని విధంగా తమ కొడుకు ప్రాణాలు కోల్పోయాడంటూ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సిద్ధార్థ్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన కిల్లి కృపారాణి



కృపారాణికి పార్టీ కండువా వేస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

టెక్కలి, ఏప్రిల్ 5: కేంద్రమాజీ మంత్రి, వైసీపీ జిల్లా పూర్వపు అధ్యక్షురాలు కిల్లి కృపారాణి శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. కడప జిల్లా బద్వేల్‌లో పీసీసీ అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల సమక్షంలో కృపారాణి, ఆమె భర్త డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, తదితరులు పార్టీ కండువా కప్పుకున్నారు. అనంతరం కృపారాణి మాట్లాడుతూ.. 2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో, ఇప్పుడు ఆయన కుమార్తె షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తే.. తనను జగన్ పక్కన పెట్టారని, కష్టపడిన వారికి ఆ పార్టీలో గుర్తింపు లేదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. సోనియా, రాహుల్ గాంధీ, ఖర్గే, ఇతర పెద్దలతో పాటు షర్మిలమ్మ నాయకత్వంలో ముందుకు నడుస్తానన్నారు.

రూ. 2100 ఇస్తాం అంతే!

- జలుమూరు మండలం పాగోడుకు చెందిన డి.శ్రీరాములు రబీ సీజన్‌లో ఎకరా పొలంలో వరిసాగు చేశారు. 25 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ధాన్యం కొనేవారు లేకపోవడంతో రోడ్లపై ఆరబెడుతున్నారు. గత ఖరీఫ్ మాదిరి కాకుండా రబీ సీజన్‌లో ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తే బావుంటుందని అభిప్రాయపడుతున్నారు. లేదంటే తమకు దళారీలే దిక్కని వాపోతున్నారు.
- జలుమూరు మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన రామరావు మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో పంట నష్టం వాటిల్లింది. ప్రస్తుత రబీ సీజన్‌లో దిగుబడి బాగున్నా.. ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా దళారీలు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని పేర్కొంటున్నారు.
- నరసన్నపేట మండలం కంబకాయి జంక్షన్‌కు చెందిన జి.అప్పలస్వామి వరి సాగుచేయగా పంట చేతికి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మార్గదర్శకాలు రాకపోవడంతో మిల్లర్లకు అమ్ముకోవాల్సి వచ్చింది. మిల్లర్లు బస్తాకు 3 కేజీల ధాన్యం అదనంగా తీసుకున్నారని అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.



- సిండికేట్‌గా మారి బస్తాకు ఐదొందల తగ్గింపు
- ధాన్యం రైతులను దోచుకుంటున్న దళారులు
- రబీ సీజన్‌లో పంట విక్రయాలకు పాట్లు
- కొనుగోలు కేంద్రాలు లేక నష్టపోతున్న వైనం



కంబకాయి జంక్షన్ వద్ద విక్రయించిన ధాన్యం బస్తాలు

(నరసన్నపేట)

ఇలా రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ఆపసోపాలు పడుతున్నారు. జిల్లాలో జలుమూరు, నరసన్నపేట, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, పాతపట్నం తదితర మండలాల్లో సుమారు 3వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రాథమిక అంచనా. ప్రస్తుతం దిగుబడి చేతికి అందగా.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రైతుభరోసా కేంద్రాల్లో(ఆర్బీకే) ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇంతవరకూ అనుమతులు మంజూరు చేయలేదు. ఒక వేళ ధాన్యం విక్రయించినా సకాలంలో డబ్బులు చెల్లిస్తారన్న నమ్మకం రైతులకు లేదు. దీంతో చాలామంది రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వారు దోపిడీకి పాల్పడుతున్నారు. ధాన్యం వ్యాపారులు సిండికేట్‌గా వ్యవహరించి బస్తాకు రూ.500 నుంచి రూ.600 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

సన్నరకాల్లో దోపిడీ ఇలా..

ఆర్‌జీఎల్, షుగర్‌లెస్ వంటి సన్నరకం బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఈ ధాన్యం బస్తా రూ.2,700 కొనుగోలు చేయాల్సి ఉండగా దళారులు రూ.2,100 మాత్రమే రైతులకు చెల్లిస్తున్నారు. దీనికితోడు పొల్లు, మట్టి పేరుతో బస్తాకు 2 కేజీల నుంచి 3 కేజీల వరకు మార్జిన్ తీసుకుంటున్నారు. జిల్లాలో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూర్పు గోదావరిజిల్లా మండలపేట, సామర్లకోటకు లారీల్లో తరలిస్తున్నారు. రూ.2,100కు కొనుగోలు చేసిన బస్తా ధాన్యం మరపడితే 60కేజీల బియ్యం దిగుబడి వస్తుంది. బియ్యం కిలో సూపర్‌ఫైన్ రకం రూ.65చొప్పున విక్రయించగా రూ.3800 వస్తోంది. అంటే బస్తా ధాన్యానికి రూ.1,700 వరకు మిల్లర్లు, దళారీలు లాభపడుతున్నారు. తమకు మాత్రం నష్టమే మిగుల్చుతున్నారని రైతులు వాపోతున్నారు. ఏటా ఖరీఫ్ మాదిరి రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మిల్లర్లు, దళారీలు అడిగిన ధరకే విక్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్నరకం ధాన్యానికి బియ్యం మాదిరి ధర నిర్ణయించాలని తోటాడకు చెందిన రైతు మాదిన నల్లాని శాస్త్రి డిమాండ్ చేశారు. ఈ విషయమై ఏడీ రవీంద్ర భారతి వద్ద ప్రస్తావించగా.. రబీలో పండే ధాన్యం కొనుగోలుపై ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● ఎంపీ రామ్మోహన్‌నాయుడు

పలాస రూరల్: గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని గెలిపించి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. గరుడఖండి గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీషల సమక్షంలో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తమ పార్టీ వారు చేపడుతున్న కార్యక్రమాలకు ఎక్కడికక్కడ వైసీపీ నాయకులు అధికార మదంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపితే ఫ్యాన్ ఆగిపోతుందేమో గానీ, సైకిల్ ఆగే ప్రసక్తే లేదని అన్నారు. ఉమ్మడి పార్టీ అభ్యర్థి గౌతు శిరీష మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీలో చేరుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అరాచక పాలనకు చరమగీతం పాడి టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, పీరుకట్ల విఠల్, కుత్తుమ లక్ష్మణ కుమార్, వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ సంతోష్, బీజేపీ నాయకులు పాలవలస వైకుంఠరావు, జనసేన నాయకులు సంతోష్‌పండా పాల్గొన్నారు.

హరిపురం/పలాస/వజ్రపుకొత్తూరు: ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్రంలో అరాచక శక్తులకు అడ్డుకట్టు పడుతుందని ఎంపీ రామ్మోహన్‌నాయుడు అన్నారు. మందస మండలం హరిపురంలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్‌డీఏ ముఖ్య నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.కార్యక్రమంలో జనసేన నాయకులు దుర్గారావు, సంతోష్ పండా, కొత్తగోపాల్, మజ్జి భాస్కరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రామానంద స్వామి, పాలవలస వైకంఠరావు, దుదిష్టి పా త్రో, కొర్రాయి బాలకృష్ణ, టీడీపీ నాయకులు విఠల్‌రావు, బావన దుర్యోధన, దాసరి తాతారావు, బైరిశెట్టి గున్నయ్య, వాసు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు. మందస మండలం కొండలోగాం గ్రామానికి చెందిన 40 గిరిజన కుటుంబాలు వైసీపీని వీడి పలా సటీడీపీ అభ్యర్థి గౌతు శిరీష సమక్షంలో శుక్రవారం ఆ పార్టీలో చేరారు. వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథిలో జరిగిన బహిరంగ సభలో ఎంపీ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి రాష్ట్రం, ప్రజల బాగు కోసం వైసీపీని గద్దె దించుతామన్నారు. పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష మాట్లాడుతూ ప్రతిపక్షాలు, స్వపక్షంలోని వ్యతిరేకులపై కక్షగట్టే నీచ సంస్కృతిని మంత్రి అప్పలరాజు పెంచి పోషిస్తున్నారన్నారు. జనసేన నాయకులు వి.దుర్గారావు, బీజేపీ నాయకులు కొర్రాయి బాలకృష్ణ, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు పాల్గొన్నారు.



గరుడఖండిలో టీడీపీలో చేరిన వారితో ఎంపీ రామ్మోహన్‌నాయుడు

నయ వంచకులను ఇంటికి పంపించండి..

నరసన్నపేట: రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిన నయవంచకులను వచ్చే ఎన్నికల్లో ఇంటికి పంపించాలని ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం నరసన్నపేట మండలం దూకలపాడు, తండ్యాలపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మహిళలకు వైసీపీ పాలనలో రక్షణ లేకుండా పోయిందని.. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారన్నారు. నారా చంద్రబాబునాయుడును సీఎంగా చేస్తే మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు ఉమ్మడి పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగ్గ సునీల్, శిమ్మ చంద్రశేఖర్, బండి పాపారావు, అప్పన్న, అడపా చంద్రశేఖర్, పూతి రమణ, కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి: మామిడి గోవిందరావు

పాతపట్నం: ఎమ్మెల్యేగా తనకు ఒక్కచాన్స్ ఇవ్వాలని.. నియోజకవర్గ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతానని టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలోని ప్రధాన రహదారులు, వీధులలో, సీది, తామర, పాసిగంగుపేట గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. నిస్వార్థ సేవలతో ఎమ్మెల్యేగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల బాబ్జీ, సలాన మోహనరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పలాస: శిరీష సమక్షంలో టీడీపీలో చేరిన గిరిజన కుటుంబాలు



నరసన్నపేట: తండ్యాలపేటలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి



పాతపట్నంలో ప్రచారం చేస్తున్న మామిడి గోవిందరావు

సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లిలో శుక్రవారం తెలుగుదేశం నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.అజయ్‌కువర్, ఎం.బాలకృష్ణ, పి.చంద్రశేఖర్, మదన్‌గౌడ్, మహేష్, గిరిబాబు, పి.డిల్లేశ్వరరావు, కె.విశ్వనాథం, పి.మల్లేశ్వరరావు, టి.నర్సింహులు, చిన్నికృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

మందసలో టీడీపీ ప్రచారం..

మందస: మందసలో తెలుగుదేశం నాయకులు శుక్రవారం రాత్రి ప్రచారంతో హోరెత్తించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ఆధ్వర్యంలో మందస వీధుల్లో భారీ ఎత్తున ప్రచారం నిర్వహించారు. గౌతు శిరీషను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, రాజాన మహేష్, డొంకూరు త్రివేణి, డొంకూరు తిరుపతిరావు, డి.లక్ష్మీనారాయణ, క్రాంతికుమార్ పాల్గొన్నారు. అదే సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలిగినా యధావిధిగా ప్రచారం సాగించారు.

శాంతిభద్రతలకు భంగం కలిగితే చర్యలు

టెక్కలి: ఎన్నికల వేళ గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగితే చర్యలు తప్పవని సీఐ పి.పైడయ్య అన్నారు. శుక్రవారం రాత్రి బూరగాం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఆయనతో పాటు ఏఎస్‌ఐ వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ పైడయ్య

అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వద్దు..

ఎల్.ఎన్.పేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమదాలవలస సీఐ జి.దివాకర్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలోని జంక్షన్‌లో శుక్రవారం స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పోలీసు సిబ్బందికి సహకరించా లన్నారు. సీఐతో పాటు ఎస్‌ఐ బీసీహార్, సిబ్బంది, సర్పంచ్ ఎం.దివాకర్‌నాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

జలుమూరు (సారవకోట): వాహనదారులు ఎన్నికల నిబంధనలు పాటించాలని నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు అన్నారు. సారవకోటలో శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించి ఎన్నిలక నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ. అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికలు

టెక్కలి: ఈనెల 7న ఉదయం 9 నుంచి నరసన్నపేట దరి గుండివల్లిపేటలో ఏపీ రెసి డెన్షియల్ స్కూల్‌లో జిల్లా స్థాయి అండర్-17 చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు ఈనెల 20, 21 తేదీల్లో కృష్ణా జిల్లా గుడివాడలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 చదరంగం పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగలవారు 7416864642 నెంబరుకు సంప్రదించాలని, శనివారం రాత్రిలోగా రూ.200 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరం

పాతపట్నం: స్థానిక అంతరాబ సచివాలయ పరిధిలో శనివారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఈవో కూర్మారావు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, క్షేత్ర స్థాయిలో దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు.

శతశాతం ఓటు నమోదు లక్ష్యం కావాలి

హరిపురం: సార్వత్రిక ఎన్నికల్లో శతశాతం ఓటు నమోదు లక్ష్యం కావాలని సెర్ప్ ఏపీఎం జి.ప్రసాదరావు తెలిపారు. మందస మండలం జిల్లుండ పంచాయితీ ఉమాగిరి గ్రామంలో డ్వాక్రా మహిళలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఓటు ఆవశ్యకతను వివరించారు. అనంతరం ర్యాలీ, మానవహారం చేపట్టి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. వీవోఏలు కేసమ్మ, తిలోత్తమ రౌలో పాల్గొన్నారు.

ఎన్నికల బాధ్యత జోనల్ అధికారులదే

నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించవలసిన బాధ్యత జోనల్ అధికారులదేనని ఆర్వో జీవీఎస్ రామ్మోహన్‌రావు సూచించా రు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జోనల్, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలను 34 జోన్లుగా విభజించినట్టు చెప్పారు. ఒక్కొక్క జోన్‌కు ఒక్కో అధికారితో పాటు సెక్టార్ అధికారిని నియమించామన్నారు. అనంతరం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వో కనకారావు, ఎలక్షన్ డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యకు స్వర నీరాజనం

పలాస: అన్నమయ్య 521వ ఆరాధనోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సత్యసాయి మందిరంలో శుక్రవారం సామూహిక అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన గాయనీమణులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందుభక్తులతో శోభాయాత్ర నిర్వహించారు. గాయకుడు, అన్నమయ్య హరిశరణాగతి సమాఖ్య వ్యవస్థాపకులు వైశ్యరాజు వెంకట రఘురామరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గాయకులంతా అన్నమయ్య కీర్తనలు వినిపించారు. మల్లా రామేశ్వరరావు, మల్లా శరత్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

వేతనదారులు సమయ పాలన పాటించాలి

నందిగాం: వేతనదారులు ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని సమయపాలన పాటించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.చిట్టిరాజు సూచించారు. శుక్రవారం పెద్దతామరాపల్లి, నౌగాంల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో వేతనదారులతో మాట్లాడుతూ ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6గంటల వరకు పనిలో పాల్గొనడం ద్వారా ఎండ తీవ్రత నుంచి రక్షణ కలుగుతుందన్నారు. పని ప్రదేశంలో వేతనదారులకు నీడ కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. నందిగాం ఉపాధి ఏపీవో ఎం.నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: శ్రీముఖలింగంలో గల శ్రీముఖలింగేశ్వర స్వామి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం బహళ ఏకాదశి సందర్భంగా ఉదయం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. సాయంత్రం గర్భగుడిలో గల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బయటకు తెచ్చి... నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి... ప్రత్యేక పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శివ, అప్పారావు, శ్రీకృష్ణ, దేవదాయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అచ్చెన్నకు పరామర్శ

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతి మృతి చెందిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని శుక్రవారం పలువురు నాయకులు పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా విభాగం నాయకులు, వైసీపీ నాయకులు నర్తు నరేంద్ర, తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ మామిడి శ్రీకాంత్, రొక్కం దొర, ధర్మాన రామదాసు తదితరులు పరామర్శించారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడును, కింజరాపు ప్రభాకర్, కింజరాపు హరివరప్రసాద్‌లను కూడా కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కళావతి చిత్రపటం ముందు వారు నివాళులర్పించారు.



అచ్చెన్నాయుడును పరామర్శిస్తున్న టీడీపీ మహిళా విభాగం ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న బోయిన గోవిందరాజులు

బస్సు యాత్రతో కళింగ కోమట్లు ఏకం

టెక్కలి: ఉత్తరాంధ్ర జిల్లాల్లో కళింగ కోమట్లు ఎక్కు వగా ఉన్న ప్రాంతాల్లో బస్సు యాత్ర నిర్వహించి అంద రినీ ఏకంచేసి తెలుగుదేశం పార్టీకి ఓటువేసే విధంగా కృషి చేద్దామని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికారిత కన్వీనర్ బోయిన గోవింద రాజులు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో ఉత్తరాంధ్ర కళింగ కోమట్ల సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నేతలు కింజరాపు అచ్చెన్నా యుడు, రామ్మోహన్‌నాయుడు కళింగ కోమట్లను బీసీల్లో చేర్చారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కళింగ కోమట్లను ఓబీసీలో చేరుస్తామ ని చంద్రబాబునాయుడు మాటిచ్చారని, అందుకే ఆ నియోజకవర్గాల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కోరాడ హరిగోపాల్, టీవీ రమణ, జామి వెంకట్రావు, లాడి శ్రీకృష్ణ, కోరాడ రాంప్రసాద్, పెద్దగోవిందు, చిన్నగోవిందు, రామ్‌కుమార్, సునీల్, విశ్వేశ్వర రావు, సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి ఉగాది సంబరాలు

పలాస రూరల్: స్థానిక జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వ ర్యంలో పలాస లయన్స్ క్లబ్ హాలులో ఈ నెల 9నుంచి ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు ఎల్.వెంకటాచలం, ప్రధాన కార్యదర్శి తమ్మినాన మన్మధరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తులసీ యోగేంద్ర మాస్టారుతో పంచాంగ శ్రవణం, బమ్మిడి సుబ్బారావుతో ఉగాది తెచ్చిన కొత్త ఉత్తరం కవితాప్రసంగం, కవులకు ఆత్మీయ సత్కారం, చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లలిత కళారంజని ఆధ్వర్యంలో..

ఈ నెల 9న ఉగాది సందర్భంగా కాశీబుగ్గ జెడ్పీ ఉన్నత పాఠశాలలో లలిత కళారంజని 33వ వార్షికోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నారు. పంచాంగ శ్రవణం, చిటారు కొమ్మన మిఠాయి పొట్లం అనే హాస్య నాటికతో పాటు శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నిరుపేద వివాహానికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: గోవిందపురం పంచాయితీ కోటబొమ్మాళి ఆర్.ఎస్.కు చెందిన నిరుపేద కొర్లాపు సుబ్బమ్మ కుమార్తె పుష్ప వివాహానికి వల్లేవలస మనబడి అసోసియేషన్ సభ్యులు రూ.40 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, మల్లేశ్వరరావు, ఇప్పిలి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుట్రను ప్రజలు గుర్తించారు

పలాస: పింఛన్ల పంపిణీ వ్యవహారంలో వైసీపీ కుట్రను ప్రజలు గుర్తించారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్ అన్నారు. శుక్రవా రం మధ్యాహ్నం కాశీబుగ్గలో ఉన్న వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌతు శిరీష 40 వేల మెజార్టీతో విజయం సాధించడం తథ్యమన్నారు. సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ సక్రమంగా చేసిన విషయాన్ని ప్రజలు గుర్తించాలని, దీనిపై ఎన్ని ప్రచారాలు చేసినా వైసీపీకి ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. చంద్రశేఖర్ త్యాడి, సవర రాంబాబు, హనుమంతు మురళీమోహన్, కొండే నర్సింహ, ఉమ బెహరా, సూర్యం, రమేష్, వాసు, రాజేష్, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు యాదవ్

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి:ఎస్పీ



జలుమూరు: సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

జలుమూరు: మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. చల్లవానిపేట కూడలిలో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలను శుక్రవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిషేధిత గంజాయి, గుట్కాలు, మద్యం అక్రమ రవాణా జరిగితే కేసులు నమోదు చేయాలన్నారు. ఆధారాలు లేకుండా తరలించే నగదును స్వాధీనం చేసుకొని.. కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎస్పీతో పాటు సీఐ బి.ప్రసాదరావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల పరిశీలన..

మెళియాపుట్టి: ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని వసుంధర, రంపకానలో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టులను ఎస్పీ రాధిక శుక్రవారం రాత్రి పరిశీలించారు. సరిహద్దు దాటుతున్న ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలన్నారు. వాహనం నెంబర్ కచ్చితంగా రికార్డు చేయాలని సూచించారు. ఒడిశా నుంచి మద్యం దిగుమతులు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమెతో పాటు సీఐ నల్లి సాయి, ఎస్‌ఐ టి.రాజేష్ తదితరులు ఉన్నారు.

సరిహద్దులో అప్రమత్తం

పాతపట్నం: సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల వద్ద విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద గల చెక్‌పోస్టును ఆమె శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. అంతకుముందు పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట సీఐ నల్లి సాయి, ఎస్‌ఐ మహమ్మద్ యాశిన్ తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో గణపతిరావు


గార: అంపోలులో ఎంఆర్‌పీఎస్ నాయకులు..


కంచిలి: ఎంపీడీవో కార్యాలయంలో..

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

కలెక్టరేట్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. సామాజిక స్పృహతోనే సామాన్యుడు అసామాన్యుడుగా మారుతాడన్నారు. అనుకున్నది సాధించేవరకు పోరాడే గొప్ప వ్యక్తిత్వం జగ్జీవన్‌రామ్ స్వంతం అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ఏడీ విశ్వమోహన్‌రెడ్డి, డీఈవో వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జిల్లా చీఫ్ కోచ్ శ్రీధర్, పర్యాటక అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, డీపీఆర్వో కె.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో..


అరసవల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


పలాస: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద..


అరసవల్లి: జిల్లా టీడీపీ కార్యాలయంలో..

టీడీపీ నాయకుడి మృతి


రామశంకర్(ఫైల్)

ఆమదాలవలస: గాజులకొల్లివలస ఆర్ఆర్ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గొర్ల రామశంకర్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. వంశధార రిజర్వాయర్ తుల గాం నిర్వాసితుడిగా గాజులకొల్లివలస వద్ద నివాసం ఉంటున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అనుచరుడిగా రామశంకర్ ప్రత్యేక గుర్తింపు పొందారు. రామ్‌శంకర్ మృతిపై రవికుమార్ సంతాపం తెలిపారు. కాగా పార్టీ మండల అధ్యక్షుడు అప్పలసూరనాయుడు, నాయకులు సొదాల గోవిందరావు మృతదేహంపై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. రామ్‌శంకర్ కుటుంబ సభ్యులకు టీడీపీ అండగా నిలుస్తుందని రాజు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి: ఆంధ్రా-ఒడిసా సరిహద్దు గ్రామాల్లో శుక్రవారం ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. చిన్నాబురుజల, బురజోల, దుర్గాం గ్రామాల్లో దాడులు చేసి ఊటలు ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ జేడీ గంగాధర్ తెలిపారు. ఎన్నికలు నెపథ్యంలో అధికంగా ఒడిసా కొండల్లో సారా తయారు కేంద్రలు అధికంగా ఉన్నాట్టు సమాచారం రావడంతో ఇరు రాష్ట్రాలకు సంబంధించి సుమారు 50 మంది వరకు సిబ్బంది దాడులు చేసి బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు తెలిపారు. 13 వేల లీటర్లు బెల్లం ఊటలతో పాటు 200 లీటర్ల సారా పట్టుబడిందన్నారు. ఈ దాడుల్లో ఈసీ తిరుపతినాయుడు, సీఐలు రామచంద్ర కుమార్, రాజశేఖర్‌నాయుడు, పద్మాలోచన్ తదితరులు ఉన్నారు.

అయ్యో స్పీకర్ గారూ..


స్పీకర్ నమస్కరించినా స్పందించని కోట

ఆమదాలవలస: రాష్ట్రంలో ప్రధాన పార్టీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఆమదాలవలస నియోజకవర్గంలో వింత పోకడలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికార వైసీపీలో నెలకొన్న గ్రూప్‌ల గోల ఆ పార్టీ అభ్యర్థి, స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రచారానికి ఎటువంటి సహాయ సహకారాలు అందించపోవడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీలో సువ్వారి గాంధీ, కోట గోవిందరావు, చింతాడ రవికుమార్... స్పీకర్ తమ్మినేనిని విభేదించి గత కొంత కాలంగా వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టారు. వీరిలో గాంధీ వైసీపీకి రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటూ నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇక చింతాడ రవికుమార్ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించడంతో ఇక్కడ ప్రచారానికి కొంతదూరం కావాల్సి వచ్చింది. ఇక కోట గోవిందరావు కూడా ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం స్పీకర్ తమ్మినేని సీతారాం కలివరం పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. తమ్మయ్యపేటలో ఉన్న వైసీపీ సీనియర్ నాయకుడు గోవిందరావు ఇంటికి స్పీకర్ వెళ్లి చేతులు జోడించి నమస్కరించినా అతడు పట్టించుకోలేదు. ఈ ఘటనను చూసిన వైసీపీ నాయకులు ఏమి చేయాలో తెలియక సైలెంట్‌గా ఉండిపోయారు.

ఎన్నికలు నిర్వహణకు కృషి చేయాలి

కంచిలి: రానున్న ఎన్నికల్లో ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని నియోజకవర్గ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సుదర్శన దొర అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. తహసీల్దార్ ఎంవీకేఎస్ రవి, ఎంపీడీవో వి.నీరజ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రామచండీదేవికి పూజలు

ఇచ్ఛాపురం: కేదారిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామచండిదేవి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బెందాళం అశోక్, కూటమి నాయకులు దాసరి రాజు, కొండా శంకర్‌రెడ్డి, ఏకాంబరి, దక్కత కామేష్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి కృష్ణ శిలా విగ్రహం ప్రతిష్ఠ వార్షికోత్సవం వేడుకగా జరిగాయి. వేకువ జాము నుండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి సింధూర మర్దన, కుంకుమ పూజలు, సహస్ర నామార్చన, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

ఇచ్ఛాపురం: గిలాయివీధిలో కొలువుతీరి ఉన్న వైభవ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కాకినాడకు చెందిన వేదపండితులు ఎస్.జనార్దనాచార్యులు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కవిటి మండలం రాజపురం గ్రామానికి చెందిన జన్నెల శంకరరావు మాస్టారు దంపతులు ఈ కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి వేడుకలు జరిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పల్లంటి సతీష్, కె.యోగి, ఆలయ అర్చకులు గుడి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు పవన్ ఎంపిక


అభినందిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు యతిరాజులు పవన్‌కుమార్ ఎంపికయ్యారు. కేశవరావుపేట గ్రామానికి చెందిన పవన్‌కుమార్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పవన్‌కు ఆంధ్రప్రదేశ్ జట్టులో స్థానం సాధించాడు. ఈ నెల 29 నుంచి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి నర్సింహరాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి, ఎగ్జామ్స్ ఏసీ ఆలీ తదితరులు పవన్‌ను అభినందించారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి


వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీడీ లోకేష్

జి.సిగడాం: ప్రభుత్వ నిబంధనలు అనుసరించి కొలతలు ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని ఏపీడీ కె.లోకేష్ అన్నారు. శుక్రవారం అనందపురంలో కొత్త పనులు గుర్తించేందుకు వేతనదారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజా అవసరాల పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఏపీవో చోళ్ల సత్యనారాయణ, జి.సిగడాం, ఆమదాలవలస, పొందూరు ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి


గేదెలవానిపేటలో ప్రచారం చేస్తున్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: రానున్న ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలనకు ఓటుతో చరమగీతం పాడాలని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పిలుపునిచ్చారు. రూరల్ మండలం గేదెలవానిపేటలో శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని, అప్పుడే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు ఆదరణ

అరసవల్లి: శ్రీకాకుళం నగరంలోని 5వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి బుర్రి మధు ఆధ్వర్యంలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఎన్డీఏ కూటమి అభ్యర్థి గొండు శంకర్ శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అంబటి లక్ష్మీరాజ్యం, శవ్వాన ఉమామహేశ్వరి, పాండ్రంకి శంకర్, నాగేంద్ర, శరత్, సంతోష్, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రాయివీధిలో శుక్రవారం రాత్రి ప్రచారం చేపట్టారు.

వైసీపీ శిలాఫలకాలకు కోడ్ వర్తించదా?


ముసుగు వేయని శిలాఫలకాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

ఇచ్ఛాపురం: డొంకూరు- బూర్జపాడు పంచాయతీ పరిధిలో డొంకపోలమ్మ గుడి నుంచి సముద్ర తీరం వరకు రహదారి నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకానికి గత నెల 7న జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిన అన్ని చోట్ల శిలఫలకాలకు, సచివాలయాలకు, విగ్రహాల కు ముసుగులు వేశారు. కానీ వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన శిలాఫలకానికి ముసుగులు వేయలేదు. శుక్రవారం ఆ పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఈ శిలాఫలకాన్ని గుర్తించి అధికారుల తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోడ్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం డొంకూరు గ్రామంలో సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, దక్కత శ్రీను, దక్కత ఏకాంబరి, రెయ్యి జానికీరావు, నందికి జాని, కొండా శంకర్‌రెడ్డి, వెంకటరావు, డి కామేష్ సహదేవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పింఛన్లపై నాటకాలు


సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న రవికుమార్

పొందూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందువల్లే పింఛన్ల పంపిణీపై ఆ పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆమ దాలవలస నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. కనిమెట్ట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. వైసీపీ అధికార దాహానికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు బలవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నెపు శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు కె.సత్యనారాయణ, ఎ.రాము, బి.శంకరభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేస్తాం

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థి బెందాళం అశోక్ విజయానికి తామంతా సైనికుల్లా పనిచేస్తామని ఇచ్ఛాపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ నిర్మలారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మా పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు ఆశి సత్యం, రామ్మూర్తి, కృష్ణమూర్తి, కాశీశ్రీను, మోహన్, నీలవేణి, తదితరులు పాల్గొన్నారు

పురుషోత్తపురంలో సూపర్ సిక్స్..

ఇచ్ఛాపురం: సూపర్ సిక్స్ పథకాలు పేదలపాటి వరమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు అన్నారు. శుక్రవారం 1వ వార్డు పురుషోత్తపురంలో సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, పట్టణ కార్యదర్శి నందికి జాని, కొండా శంకర్‌రెడ్డి, కాళ్ల జయదేవ్, కాళ్ల దిలీప్, శేఖర్, రెయ్యి జానకిరావు, లీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే పార్టీకి మేలు

అరసవల్లి: సమస్యలు ఎదురైనప్పుడు సంయమనం, క్రమశిక్షణతో వ్యవహరిస్తేనే పార్టీకి మేలు జరుగుతుందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. పట్టణ టీడీపీ నాయకులతో సమావేశాన్ని అరసవల్లిలో గల వారి స్వగృహంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండ దంపతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం అభిప్రాయ సేకరణ చేస్తున్నారని, పార్టీకి మేలు జరిగే నిర్ణయం అధిష్టానం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదారపు వెంకటేష్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, రోణంకి కల్యాణ్, నగర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డయల్ యువర్ వర్సిటీ రద్దు

ఎచ్చెర్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ప్రతి నెల మొదటి శనివారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమాన్ని రద్దుచేస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

జగన్‌రెడ్డి డ్రామాలో భాగమే..

సరుబుజ్జిలి: కుతంత్ర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన వైసీపీ అధినేత జగన్‌రెడ్డి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు వలంటీర్ల రూపంలో కొత్త డ్రామాకు తెరలేపిన విషయం అందరికీ తెలిసిందే. తాజాగా ఈ వలంటీర్ల రాజీనామా డ్రామా పల్లెలకు కూడా వ్యాపించడంతో ప్రజలు నవ్వుకుంటున్నారు. శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా సెలవు దినం. అయితే గత నాలుగు రోజులుగా వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా చేయాలంటూ ఆ సంఘ మండల కన్వీనర్ సోషల్ మీడియాలో నోట్ పెట్టారు. దీనిపై మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో ఉన్న సుమారు 175 మంది వలంటీర్ల నుంచి ఎటువంటి స్పందనా కనిపించలేదు. మళ్లీ గురువారం సాయంత్రం అదే కన్వీనర్ మరో సమాచారంతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి రాజీనామా చేయడానికి వలంటీర్లు అందరూ రావాలని సమాచారం పెట్టారు. శుక్రవారం సెలవు రోజు కావడంతో వలంటీర్లు రాజీనామా చేయడం లేదంటూ మరో సమచారం అందింది. వీటిని చూసినవారు సెలవు రోజు రాజీనామాలు ఓ డ్రామా అంటూ చర్చించుకుంటున్నారు.

10 నుంచి ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. హౌస్ వైరింగ్, కంప్యూటర్ అకౌంట్స్‌లో నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 19-45 ఏళ్ల లోపు గ్రామీణ ప్రాంత యువకులు అర్హులని, ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 95534 10809, 7993340407 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరు సాగిస్తాం

అరసవల్లి: ప్రజా సమస్యలపై పోరు సాగిస్తామని, దీని ద్వారానే మెరుగైన సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని పలువురు వక్తలు అన్నారు. నగరంలోని స్థానిక ఎన్జీవో హోమ్‌లో పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. తొలుత బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నగరంలో చాలా సమస్యలు పేరుకుపోయాయన్నారు. ముఖ్యంగా మురుగునీటిని శుద్ధి చేయకుండా నదిలో కలపడం వల్ల నీరు కలుషితమై, నగరవాసులు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎం.గోవర్ధనరావు, కమిటీ సభ్యులుగా ఎం.ఆదినారాయణ మూర్తి, ఎ.వెంకటేశ్వర్లు, జి.పద్మావతిని ఎన్నుకున్నారు.

వేసవి జాగ్రత్తలు పాటించండి

శ్రీకాకుళం క్రైం: నిరంతరం ప్రజలకు సేవలందించేందుకు ఎండలో శ్రమించే ట్రాఫిక్ పోలీసులు వేసవి జాగ్రత్తలు పాటించాలని సీఐ ఎం.అవతారం సూచించారు. శుక్రవారం ఏడురోడ్ల కూడలిలో విజయదుర్గ అమ్మవారి దేవాలయం అర్చక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో విజయదుర్గ ఆలయ అర్చక బృందం ఆరవిల్లి సూర్యనారాయణశర్మ, ఫణికుమార్ శర్మ, కామేశ్వరశర్మ ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగించుకోండి

శ్రీకాకుళం క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ సూచించారు. శుక్రవారం స్థానిక హయాతినగరంలోని అసిరితల్లి ఆలయం వద్ద ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఎన్నిల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

గార: ప్రతీ ఒక్కరూ ఎన్నికలు నిబంధనలు పాటించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎల్ఎస్ నాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం కె.సైరిగాం గ్రామంలో ఎన్నికల కోడ్ పై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల, కేశవరావుపేట, ఎస్ఎం పురం గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శుక్రవారం పోలీసు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహణకు ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. ఈ కార్యక్రమంలో జేఆర్‌పురం సీఐ రామచంద్రరావు, ఎచ్చెర్ల, జి.సిగడాం ఎస్ఐలు ఎస్.చిరంజీవి, మధుసూదనరావు, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.


ఎచ్చెర్లలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ హైమావతి

సోంపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ హైమావతి కోరారు. పలాసపురం, లక్కవరం గ్రామాల్లో శుక్రవారం రాత్రి గ్రామస్థులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి ట్రిపుల్ ఐటీలో టెక్ ఫెస్ట్


బ్రోచర్స్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: విద్యార్థుల్లో సాంకేతికను వెలికితీసేలా ఈ నెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు టెక్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్టు ట్రిబుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. విద్యార్థుల్లో సాంకేతిక స్ఫూర్తిని నింపేలా వర్క్‌షాపుతో పాటు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు. పవర్ పాయింట్, పోస్టర్ ప్రజెంటేషన్ కూడా ఉంటుందన్నారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు క్యాంపసేతర విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నామన్నారు. అలాగే విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, టెక్ ఫెస్ట్ కన్వీనర్ సీహెచ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గార: ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ రెవెన్యూ పోలీసు అధికారులతో మాట్లాడారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలింగ్ కేంద్రాల మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనుతో వివిధ అంశాలపై మాట్లాడి తెలుసుకున్నారు. తర్వాత గార దగ్గరలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి రోజారాణి, ఇతర అధికారులతో మాట్లాడారు. ఆర్డీవో రంగయ్య, సీఐ ఎల్ఎస్ నాయుడు, ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్, ఆర్ఐ అనిల్ కుమార్, ఏవో శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం


ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బహుళ ఏకాదశి(మతత్రయ ఏకాదశి)ని పురస్కరించుకుని , ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో, ఆలయ అనివెట్టి మండపంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వేద పండితులు, ఆలయ అర్చకులు కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, ఇప్పిలి సాందీపశర్మ, ధర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.